అడవి - సముద్రం

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్



బసవరాజం అతి కష్టం మీద చంద్రశేఖరాన్ని పెళ్లి చూపులకు ఒప్పించాడు !!

"నాకీ పల్లెటూరి సంప్రదాయాలూ మర్యాదలూ బొత్తిగా తెలియవు మామయ్యా - బాధ్యతంతా నీదే" అన్నాడు చంద్రశేఖరం !

'నీ కెందుకు చందూ ! నేను శ్రీకృష్ణునిలా బండి నడుపుతూ వుంటాను. నీవు అర్జునుడిలా కూర్చో -' అన్నాడు బసవరాజం ! !

చంద్రశేఖరానికి మేనమామ బసవరాజం!!

మేనల్లుడి మీద చిన్నప్పటి నుంచీ చాలా ప్రేమ అయనకు. అందుకే అల్లుణ్ణి ఓ ఇంటివాణ్ణి చేయాలనే సంకల్పంతో ఎన్నెన్నో సంబంధాలు చూశాడు. ఆడపిల్ల వాళ్లు తిరిగిన దానికన్నా ఎక్కువగా తిరిగి సంబంధాలు విచారిస్తున్నాడు.

నివగాంలో పాండురంగ భుక్తగారి కూతురు పదెకరాల మాగాణీతో వస్తుందని తెలిసి మేనల్లుణ్ణి పెళ్లి చూపులకు ప్రయాణం కట్టించాడు.

చంద్రశేఖరం ఉద్యోగానికి వో రోజు శలవు పెట్టి వో ఆదివారం కూడా కలిసి వచ్చేటట్టు చూచుకొని మామయ్యతో విశాఖ నుండి నివగాం బయల్దేరాడు.

విశాఖ నుండి ముందు ఆముదాలవలసకు బస్సెక్కారు.

బస్సు ముంత మామిడి తోటల మధ్యగా దూసుకు పోతున్నది.

చంద్రశేఖరం అనుకున్నాడు 'పిల్లమాట ఎలా వున్నా ప్రకృతి మాత్రం ఆహ్లాదకరంగా వుంది- వో పిక్నిక్‌కు వెళ్ళినట్లు.'

మధ్యాహ్నానికల్లా శ్రీకాకుళం వచ్చింది.

అక్కడ ఆర్. టి. సి. బస్‌స్టాండు వద్ద భోజనంచేసి మళ్లీ బస్సులో కూర్చున్నారు.

చంద్రశేఖరానికి ఈ ప్రాంత మంతా కొత్త !

విజయవాడ నుండి విశాఖకు ఏడాది క్రితం ట్రాన్స్‌ఫర్ అయినా ఎన్నడూ విశాఖ పొలిమేరలు వదిలి పోలేదు ఒక్క సింహాచలానికి తప్ప !

మొదటిసారి ఇప్పుడు జిల్లా సరిహద్దులు దాటి పోతున్నాడు దుష్యంతునిలా, కన్యాన్వేషణకు ! !

ఎండాకాలం కావడంతో బస్సు దిగిన చోటల్లా తాటిముంజలుఅమ్మవస్తున్నాయి.

బసవరాజం వెయించిన జీడిపప్పు పొట్లాలు కొన్నాడు.

చంద్రశేఖరం పనస చెట్లనూ. మామిడి తోపులనూ చూస్తున్నాడు. ప్రకృతివనరులు ఎక్కువ ఉపయోగించుకోవడం మాత్రం తక్కువ అనుకున్నాడు స్వగతంలో చందూ

బస్సు సాయంత్రానికి నివగాం చేరింది.

నివగాం వద్ద వంశధార చాలా విశాలంగ వుంటుంది.

ఎండాకాలం కావడంతో నదిలో నీళ్లులేవు చుట్టూ వందల ఎకరాల మామిడితోటలు సాయంత్రం కావడంతో లక్షల పక్షులు భూమ్యాకాశాలు పట్టనంత రొద చేస్తున్నాయి.

బసవరాజం చేసిన సూచనమేరకు నివగాం వద్దకు ముందే ఎడ్లబండి వచ్చి నిలబడి వుంది మధ్యాహ్నంనుండి బండివద్దకు స్వయంగా పాండురంగభుక్త వచ్చాడు. నీర్కావి పంచె, పొడుగుచొక్కా, చొక్కా నిండా జేబులే !!!

ఆయన వినయంచూసి చంద్రశేఖరం ఆశ్చర్యపోయాడు ముగ్గురూ బండిలో కూర్చున్నారు.

నివగాంకు ఆనుకోని కుద్దిగాం అనే అగ్రహారం వుంది. పెళ్లిచూపులు అక్కడ!!

భుక్త అతిథుల ప్రయాణాన్ని గూర్చి అడిగాడు.

'ఎండంతా మాపాలే పడింది' అని బసవరాజం తాము ఎన్ని గంటలకు బయలుదేరి ఎక్కడెక్కడ ఆగుతూ వచ్చారో ఎక్కడ భోంచేశారో, ఎక్కడ తాటిముంజలూ, ఉడిపప్పు తిన్నారో అన్నీ వివరంగా చెప్తున్నాడు.

చంద్రశేఖరం మాత్రం మౌనంగా కూర్చున్నాడు.

ఎడ్లబండి ఇసుకలో సాగిపోతున్నది మెత్తగా మువ్వల శబ్దంచేస్తూ!

తాటిచెట్ల దగ్గర నిలబడ్డ గొడ్లుకాచే పిల్లలు కర్రలు మెడమీద రెండుచేతులతోనూ వంచి పట్టుకొని అతిథులను వింతగా చూస్తున్నారు.

బండి కుద్దిగాం చేరింది.

పొట్టి పొట్టి పందిళ్లమీదినుండి మల్లెపూల ఘుమఘుమలు. పాండురంగభుక్త వచ్చిన అతిథులకు ముందే విడిది సిద్ధంచేసి వుంచాడు.

అదొక మట్టియిల్లు!

శుభ్రంగా పేడలో అలికి ముగ్గులు పెట్టారు — ఒకమూల గాదెలు — పక్కనే ఏవో పప్పు బస్తాలు. బయట జామిచెట్టు, కొబ్బరిచెట్లు — మల్లెపందిరి. భుక్తగారి పాలేరు సిద్ధంగా వున్నాడు ఎప్పటినుంచో— బసవరాజం, చంద్రశేఖరంరాగానే కొబ్బరి బోండాలు కొట్టి ఇచ్చాడు పాలేరు —

కొబ్బరినీళ్లతో దప్పిక తీర్చుకున్నారు ఇద్దరూ. బావిదగ్గర స్నానంచేసి బట్టలు మార్చుకున్నారు.

'గతికితే అతకదని భోజనాలు మా ఇంట్లో ఏర్పాటు చేయలేదు' పాండురంగ భుక్త అతివినయంగా మనవి చేసుకున్నాడు.

చంద్రశేఖరం చిరునవ్వు నవ్వుకున్నాడు. అంటె నైవేద్యాలు తమ ఆలయానికే వస్తాయన్నమాట.

'అల్లుడూ నువ్వు హాయిగా విశ్రాంతి తీసుకో. నేనట్లా పెద్దమనుషుల దగ్గరికి పోయి అవీ ఇవీ మాట్లాడివస్తాను' అన్నాడు బసవరాజం. అంటే బసవరాజం తన పరోక్షంలో పెళ్ళివాళ్లతో కట్నాలూ కానుకలూ ఇతరత్రా విషయాలూ ఏవో కాన్ఫిడెన్షియల్‌గా మాట్లాడాలని వెళ్తున్నట్లు చంద్రశేఖరం ఊహించాడు —

బసవరాజం వెళ్ళిపోయాడు.

చంద్రశేఖరం ఆకాశంవంక చూచాడు. కుంకుమపువ్వు పొడి చేసి వెదజల్లినట్లు ప్రకృతి — నుదుట పెద్దబొట్టు పెట్టుకున్న ముసలి ముత్తైదువులా అలసిపోయిన సాయంకాలపు సూర్యుడు.

చంద్రశేఖరం మట్టిగదుల మధ్యనుండి

గాలి పీల్చుకునే నిమిత్తం బయటపడ్డాడు.

చంద్రశేఖరానికి అంగరక్షకుడుగా నియమింపబడ్డ పాలేరు వెంటబడ్డాడు.

వద్దని వారించాడు చందూ–

గడ్డాల మధ్య, ఇసుక మధ్య నడుస్తూ చందూ వంశధార వైపు వెళ్ళాడు.

ఇద్దరు గొడ్లు కాచుకునే పిల్లలు 'ఎవరా ? ఈ కొత్త మనిషి ?' అన్నట్లు గూఢచారుల్లా కొంత దూరం ఫాలో అయి చందూ వాళ్ళ వైపు చూచేసరికి బెదిరిపోయి వెనుక ముఖం పట్టారు.

కాళ్ళు చీలమండలు తడిసే మాత్రం నీరు చాలా బలహీనంగా ప్రవహిస్తున్నది. నదిలో సూర్యుని ప్రతాపానికి కుంగిపోయి చందూ నీళ్ళల్లో నిలబడ్డాడు.

కాళ్ళచుట్టూ నీళ్ళు సుడులు తిరిగాయి సన్నగా.

రెండు చిరుకప్పలు ఇసుకలోకి ఎగిరి దూకాయి.

చిరుగాలికి ఇసుక రేగింది.

చందూ తలను తాకుతూ తెల్లని జలపక్షి ఒకటి చాలా కిందిగా ఎగురుతూ పోయింది.

చందూ త్రుళ్ళిపడ్డాడు.

దూరంగా ఎవరో కిల కిల నవ్వుతున్న శబ్దం!

చందూ అటు చూచాడు.

జామచెట్లు చాటున ఎవరో ఉన్నట్లు పసికట్టాడు.

చందూ అటు నడిచాడు.

చెట్టు చాటున నవ్వులు ఆగిపోయాయి.

నిశ్శబ్దం.

చందూ జామిచెట్లు తోపును చేరాడు.

చెట్ల చాటు నుండి బెదురుతూ రెండు జతల కళ్ళు చందూను చూస్తున్నాయని చందూ గ్రహించాడు.

'ఎవరు మీరు ?'

రెండు లేడి కూనలూ బెదిరిపోయాయి. పరుగెత్తడం కోసం అటు ఇటూ చూస్తున్నాయి.

చందూ వాళ్ళకు అడ్డంగా నిలబడ్డాడు.

వాళ్ళ కళ్ళలో భయం- పారిపోయేందుకు దోవలేక బిత్తర చూపులు ... చందు చిరునవ్వులతో మూడు నాలుగు మృదువాక్యాలలో పసమారి జింకలను మచ్చిక చేసుకున్నాడు.

లేళ్ళకు భయం కొంచెం తీరింది

'కూర్చోండి' – యజమాని ఆజ్ఞను శిరసావహించినట్లు ఇద్దరు పిల్లలూ కూర్చున్నారు ఇసుకలో.

'మీ పేరేమిటి ?'

"... ... ..."

మళ్ళీ అదే ప్రశ్న !!

'నా పేరు కామాక్షి – ఈమె పేరు శశిరేఖ.'

శశిరేఖ మాట్లాడటంలేదు – కామాక్షే మాట్లాడుతున్నది.

'ఏం చేస్తున్నారు ఈ తోటలో సాయంత్రం 'కామాక్షి చిరునవ్వు నవ్వింది.

శశిరేఖ సిగ్గుతో తల వంచుకుంది.

'చీకటిపడితే భయంలేదా...'

'ఇంకా పడలేదుగా-అయినా నదిదగ్గర మాకేం భయం –' కామాక్షే జవాబు చెప్పింది.

'షికారుకు వచ్చేరా సాయంత్రం.'

'ఊఁ...'

'నేనెవరో మీకు తెలుసా ?'

'ఊఁ' - తెలుసునన్నట్లు తల వూపింది కామాక్షి.

'నీవే మాట్లాడుతున్నావు – ఆ పిల్లకు మాటలు రావా ? మూగదా ?'

కామాక్షి కిలకిలా నవ్వింది.

శశిరేఖ ముడుచుకొని పోయింది–

వర్షంలోని నెమలిపింఛంలా.

హేమంతంలోని మంచుమధ్య కమలంలా శశిరేఖ లేచిపోవడానికి విఫల ప్రయత్నం చేసింది, చందూ మళ్ళీ అడ్డుపడ్డాడు.

'ఈమె పెళ్ళికూతురు. ఈమెను చూడడానికే మీరు వచ్చారు' కామాక్షి చెప్పింది.

శశిరేఖ తలను రెండు మోకాళ్ళమధ్య దాచుకొని ధనుస్సులా వంగింది సిగ్గుతో. చందూ ఆశ్చర్యపోయాడు.

ఇప్పుడు శశిరేఖను మళ్ళీ శ్రద్ధగా పరిశీలించాడు. కామాక్షి– శశిరేఖా ఒకే ఈడులో వున్నారు కావి కామాక్షి కన్నా శశిరేఖ చాలా అందంగా వుంది.

లేడి లాంటి కళ్ళు– కళ్ళనిండా కాటుక – ముఖాన తిలకం పెద్ద ఖరీదైనదని చెప్పలేని పరికిణీ, వోణీ, చేతుల నిండా రంగు రంగుల గాజులు, విరిసిన ఇంద్ర ధనుస్సులా– ముడుచుకున్న ముద్దబంతి పూవులా కూర్చున్నది శశిరేఖ తలవంచుకొని.

మాత ధారణ సమయంలో కూర్చున్న పెళ్ళికూతురులా! ! పొడవైన నల్లని జడలో మల్లెపూల దండలు, ఇంద్ర నీలాల మాల చివర ముత్యాలలా మెరుస్తున్నాయి. 'కాదు- కాదు వంశ ధార పాయలో తెల్లని గవ్వల్లా మెరుస్తున్నాయి' అనుకున్నాడు చందూ.

కొంచెంసేపాగి 'అయితే నన్ను చూద్దామని వచ్చారన్నమాట' అన్నాడు చందూ.

కామాక్షి మళ్ళీ కిల కిలా నవ్వింది.

శశిరేఖ కళ్ళు సిగ్గుతో కుండ పోతగా వర్షించాయి.

'ఈమె బుగ్గల ఎరుపుకు సిగ్గుపడి ఆకాశం పారిపోతున్నది– ఈమె సిగ్గుతో నిండిపోయి ప్రకృతి కాటుక రంగు పూసు



కరెన్సీ నోట్ల తమాషాలు !

★ కేంద్రం ఆర్డినెన్స్‌ద్వారా వెయ్యి, ఐదువేలు, పదివేలు విలువచేసే నోట్లని రద్దుచేశాక, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలో రెండు లక్షల రూపాయలు విలువచేసే వేయి రూపాయల నోట్ల కట్టలు గుర్తు తెలియని వ్యక్తులు పడేశారు !

★ బొంబాయి రిజర్వు బ్యాంకువద్ద రెండు డజన్లమంది విదేశీయులు పెద్ద నోట్ల రద్దువల్ల తమకు కలిగిన ఇబ్బందిని తెలియ జేసేందుకు పెద్ద పెట్టున కేకలు, బొబ్బలు పెట్టారు.

★ బొంబాయి రిజర్వు బ్యాంకుకు సిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒకవ్యక్తి వచ్చి ఆస్పత్రి బిల్లులు చెల్లించడం కోసం వెయ్యి రూపాయల నోటుకు చిల్లర నోట్లు ఇవ్వవలసినదిగా కోరాడు. ఈ వ్యక్తి విషయంలో మామూలు లాంఛనాలను రద్దుచేసి కోరికను మన్నించారు.

★ సూరత్‌లో రు.1000ల నోట్లు ఒక్కొక్కటి రు.200 లకు అమ్ముతామని బేరం పెట్టారు !

★ సూరత్‌లోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచిలో ఎనిమిదేళ్ళ బాలుడు వెయ్యిరూపాయల నోటును మార్చుకోడానికి వచ్చాడు. మైనర్ గనుక డిక్లరేషన్ దాఖలు చేసేందుకు వీలు లేక, తిరిగి పోవలసి వచ్చింది.

★ సూరత్ లోని వజ్రాల మార్కెట్‌లో ఒక వజ్రాల వ్యాపారి ఒక వెయ్యి రూపాయల నోటును సిగరెట్‌గా చుట్టి నిప్పంటించుకొని విలాసంగా కాల్చాడు. మరొక వజ్రాల వ్యాపారి నాలుగు వెయ్యి రూపాయల నోట్లపై నూనెతోచేసిన తినుబండారాలను పెట్టి ఆరగించాడు !

[సేకరణ : ప్రసాద్]

అడవి - సముద్రం

కుంటున్నది' అనుకున్నాడు చందూ.

ఆమె సిగ్గును తొలగించడం కోసం చందూ మెల్లగా ఆ మాటా ఈ మాటా మొదలు పెట్టాడు.

చందూ మాటలను వాళ్ళు శ్రద్ధగా వింటున్నారు.

'అయితే విశాఖపట్నంలో విమానాలు నేలమీదికి దిగుతాయా ?' కామాక్షి ప్రశ్నించింది.

'ఆఁ— నేలమీద కొంత దూరం పరుగెత్తుతాయి కూడా'

'అమ్మో ! అయితే మీ రెప్పుడయినా విమాన మెక్కారా ?'

'ఆఁ—'

'అప్పుడు కళ్ళు తిరిగాయా ? కళ్ళు తిరిగితే నిమ్మకాయ ముక్కలు జేబులో పెట్టుకోవాలిట మా బాబాయి ఒకసారి చెప్పాడు...'

చందూ మల్లెపువ్వులాంటి స్వచ్ఛమైన నవ్వు నవ్వాడు.

'మీరెప్పుడు విమానాలు చూడలేదా ?' చందూ ప్రశ్నించాడు.

'చూడకేం ఆకాశంలో ఎగురుతూంటే చూశాం — అయితే విశాఖపట్నం ఎప్పుడూ చూడలేదు. ఒకసారి సింహాచలం పోవలసిన అవకాశం వచ్చింది కాని మళ్ళీ మాతమ్ముడికి జ్వరం వచ్చేసరికి మానుకున్నాము —'

'మీ స్నేహితురాలు చూసిందా విశాఖ' చందూ ప్రశ్నించాడు. కామాక్షి. కలకలా నవ్వింది — ఆ నవ్వు మొగలిపువ్వు నుంచి రేగిన పుప్పొడిలా నలుదిక్కులా వెదజల్లబడ్డది !

'శశిరేఖ ఎన్నడూ శ్రీకాకుళమే పోలేదు ఇక విశాఖ మాటేమిటి ? ? — శశిరేఖ సినిమాకూడా చూడలేదు, నేను చూచానులే మా నాన్నతో శ్రీకాకుళం పోయినప్పుడు...' కామాక్షి చెప్పింది !!

చందూ శశిరేఖను చూచాడు.

శశిరేఖ ఇప్పుడు తాను పెళ్ళికూతురు నన్న విషయం మరచిపోయి కొంచెం ముందుకు జరిగి చందూ మాటలను వినడానికి చెవులూ కళ్ళూ రిక్కించి కూర్చున్నది.

చందూవాళ్ళ స్థితి గమనించాడు. ఇంకేం విశాఖ గొప్పతనాన్ని కథలు కథలుగా వర్ణించసాగాడు — అక్కడి నౌకలూ — డాల్ఫిన్స్ నోస్, కాల్టెక్స్, యూనివర్సిటీ, రేడియో స్టేషన్, పిచ్చాసుపత్రి...

'అయితే పిచ్చాసుపత్రిలో...' కామాక్షి ఆసక్తితో ఏదో అడగబోయి 'వద్దులెండి — పిచ్చివాళ్ళగూర్చి మాకు చెప్పవద్దు—భయం' అన్నది.

'ఈ నదిదగ్గర చీకట్లో భయంలేదా ?' అన్నాడు చందూ —

'మా అక్కదగ్గర మాకేం భయం — ఇది నదికాదు మా అక్క!' అన్నది కామాక్షి.

'అలాగా' అన్నాడు చందూ.

'ఔను — ఒకసారి వర్షాకాలంలో ఈ తోటల్లోకి పెద్దపులి వచ్చింది — దానిని జగన్నాథస్వామి తరిమేశాడు.'

'జగన్నాథస్వామి ఎవరు, పూరీలో దేవుడా ?'

చందూ అమాయకత్వానికి కామాక్షి మళ్ళీ నవ్వింది.

జగన్నాథస్వామే నీకు తెలీదా ? అన్నట్లు చూచి ''శశిరేఖ మేనమామ— వాళ్ళమ్మకు రెండో తమ్ముడు'' అన్నది.

'జగన్నాథస్వామి అంత పరాక్రమ వంతుడా ?' అన్నాడు చందూ.

'ఆఁ— ఒకసారి వర్షాకాలంలో ఈ నదిలో కొండచిలువ కొట్టుకువస్తే దాన్ని ఒకే దెబ్బకు జామతోటలో చంపేశాడు' శశిరేఖ నోటివెంట ముత్యాలు రాలాయి.

'ఈ వూళ్ళో వున్నాడా ? ఇప్పుడు ?' చందూ ప్రశ్నించాడు.

'లేడుగా ! శశిరేఖను జగన్నాథానికి చేసుకోవాలని మా గౌరమ్మత్తకు— అంటే జగన్నాథం అమ్మకు కోరిక. అయితే మా పాండురంగం మామ 'నా కూతురు లక్ష్మీదేవి— ఈమెను ఎవరైనా ఆఫీసరుకే ఇస్తాను' అన్నాడు. అందుకని కోపంవచ్చి కొడుకుతో కుద్దిగాం వదిలి పర్లాకిమిడి వెళ్ళిపోయింది.'

'జగన్నాథమంటే నీకిష్టమా ?' చందూ శశిరేఖను అడిగాడు. శశిరేఖ సిగ్గుతో తల వంచుకుంది.

అయితే చీకట్లు ముసరడంతో ఆమె బుగ్గల రంగును చందూ పోల్చుకోలేక పోయాడు.

కామాక్షి మాత్రం ఎదురుప్రశ్న వేసింది. 'ఇష్టమంటే ఏమిటి ?'

'అంటే– పెళ్ళి చేసుకోవాలన్న కోరిక.'

కామాక్షి ఒక్క క్షణం ఆగి అన్నది 'మా వూళ్ళో ఆడపిల్లలకు అలాంటి కోరికంటూ ఏమీ వుండదు– మా అమ్మా నాన్నా ఎవరినిచ్చి పెళ్ళి చేస్తే ఆ రోజు నుంచీ ఆయనే మొగుడు.'

పలచని వంశ ధారలో చంద్రోదయం ప్రతిబింబించింది.

'అవును– సూర్యోదయమూ ప్రతిబింబిస్తుంది–చుక్కలూ ప్రతిబింబిస్తాయి – ఈ నది వీళ్లకు అక్క !' అనుకున్నాడు చందూ !!.

ఆ తర్వాత కామాక్షి ఏమిటో చెపుతున్నవి శాఖాచంక్రమణంచేస్తూ అంశాలను.

ముందు కుద్దిగాం చరిత్ర చెపుతున్నది. వాళ్ల ఊరివెలుపల మాకవరంలో నీలకంఠేశ్వరుని కోవెల వుందిట ! వర్షాకాలంలో గుడి మునిగిపోతుందిట ! నూరేళ్లక్రితం ఈ అడవుల్లో తాటాజు అనే సవరరాజు ముఠా దోపిడీలు చేసేదట — దొరలు దాన్ని అణిచారట !

కొన్నాళ్ళ తర్వాత ఈ గ్రామం నదిలో కలిసిపోతుందిట ! అప్పుడు ఈ గ్రామస్థులంతా ఎక్కడో ఇళ్ళు కట్టుకోవాలిట !!

'అమ్మో ! చీకటి పడింది —' అన్నది శశిరేఖ – కామాక్షీ, శశిరేఖలు చివాలున లేచి నిలబడ్డారు.

'వస్తామండీ !' కామాక్షి మాత్రం వీడ్కోలు చెప్పింది.

శశిరేఖ ఒక్కసారి చంద్రశేఖరాన్ని చూచి పిస్నతో చీకట్లో పారిపోయింది.

రివ్వున మామిడిచెట్టు మీదినుండి దూసుకుంటూ ఓ నల్లని కోయిల నది అవతలి తోటలోకి పోయింది 'కుహూ – కుహూ—' మంటూ చందూ నెత్తిమీద గుండా' !

చంద్రశేఖరం మరి కొంతసేపు అలాగే కూర్చున్నాడు కదలకుండా.

దూరాన మనుషుల మాటలు —

తోటల్లో కోకిలల అరుపులు —

నదిలో కప్పల చిరు శబ్దాలు —

ఎక్కడో దూరంగా కీచురాళ్ల శబ్దం —

కుద్దిగాం గ్రామం మొత్తం బుడ్డి దీపాలతో అలంకరించుకుంది, చుక్కలతో అలంకరించుకున్న ఆకాశంలా 'కాదుకాదు తోలుబొమ్మలాటలో దీపంముందున్న తెర మీది బొమ్మలాటలా వున్నది ఈ గ్రామంలోని జీవితం లాంతర్ల వెలుగుల మధ్య' అనుకున్నాడు చంద్రశేఖరం...

అలా ఎంతసేపు తన్మయుడై కూర్చున్నాడో తెలియదు. 'చందూ– చందూ' అన్న బసవరాజం కేకతో ఈ లోకానికి వచ్చాడు

'చందూ– చందూ' మళ్ళీ బసవరాజం కేక.

'ఇక్కడున్నాను మామయ్యా'

గొంతును గుర్తుపట్టి వచ్చారు మనుషులు.

బసవరాజం, పాలేరు, పాండురంగ భుక్త ఇంకెవరో ఒకరూ.

'నీవు కనపడక పోయేసరికి వెతుకుతూ వచ్చాం' అన్నాడు బసవరాజం.

'ఔను– కొత్త ప్రదేశం కదా బాబూ– పురుగూ పుట్రా ఉంటాయి చీకట్లో' – వినయంగా అన్నాడు పాండురంగ భుక్త.

చంద్రశేఖరం లేచి నిలబడ్డాడు.

వాళ్లను అనుసరించాడు.

ఆ రాత్రి చంద్రశేఖరం– బసవరాజూకు కుద్దిగాంలో విందు భోజనం– దంపిన బియ్యపన్నం, సువర్ణరేఖల మామిడిపండ్లూ, గడ్డపెరుగు, ఆవునెయ్యీ– పనసతొనలూ' పాయసం. భోజనం కాగానే బసవరాజం గుర్రుపెట్టి నిద్రపోయాడు.

కాని చంద్రశేఖరానికి నిద్రపట్టలేదు. గాలి తిరుగుతున్న కొద్దీ మామిడిపళ్ల వాసనలు, మొగలి పొదల వాసనలు. మల్లె పందిళ్ల వాసనలు, ఏ రాత్రి నిద్రపట్టిందో ఏమో తెల్లవారు జామున పాలేరు పిలుపుతో మెలకు వచ్చింది– కోళ్లు కూస్తున్నాయి.

పాలేరు అతిథులకు కాలకృత్యాలకై లేపాడు– బసవరాజం, చంద్రశేఖరం నది తీరానికి బయలుదేరారు– వెనకాల లాంతరు పట్టుకొని పాలేరు– నీటితోతడిసి రాత్రంతా చల్లబడ్డ మట్టి ఒక విచిత్రమైన సహజ గంధాన్ని వెదజల్లుతున్నది వంశధార ఒడ్డున!

'అబ్బ! మట్టికి యింత సువాసన వుందా?' అని ఆశ్చర్యపోయాడు చంద్రశేఖరం–

'బ్రహ్మదేవుడు సృష్టి ప్రారంభంలో చేసిన మొదటి ఊహలా వుంది ఈ పల్లెటూరు ఈ తెల్లవారుజామున' అనుకున్నాడు చంద్రశేఖరం !!

మెల్లగా తూర్పు రేఖలు తెల్లవారాయి!!

సూర్యుడు పైకి వచ్చాడు.

అతిథు లిద్దరికీ– ఉప్మాలూ, కాఫీలూ.

తర్వాత పెళ్ళిచూపులు–

శశిరేఖను సర్వాంగ భూషితగా అలంకరించారు– బుట్ట లోలాకులూ, కాసుల



ఐటెక్స్
కాటుక & తిలకము
నాణ్యతలో గొప్పవి
అందమైన రంగులు

33 సంవత్సరముల
అనుభవము వేరు విధముగ
వుండుటకు వీలులేదు.
ARAVIND
LABORATORIES
MADRAS-600 033
AL:T2

పేర్పు, వడ్డాణం, నుదుట కల్యాణతిలకం మొగలపూల జడ— చుట్టూ కొందరు ముత్తైదువులు కూర్చున్నారు.

చంద్రశేఖరం శశిరేఖను చూచాడు.

'ఎంత అందం! ఎంత అమాయకత్వం! ఈ పిల్లను చేసుకున్నవాడు ధన్యుడు' అనుకున్నాడు చంద్రశేఖరం!

పెళ్ళిచూపులు ముగిశాయి.

ఇక బయలుదేరుతామని బసవరాజం ప్రయాణం కట్టాడు.

ఉండమని బలవంతం చేశాడు భుక్త!

'కనీసం భోజనాలు చేశయినా వెళ్ళరు' అని వేడుకున్నాడు చేతులు పట్టుకొని.

'వద్దు— మరీ ఎండవేళ పోలేము' అనీ బసవరాజం అప్పుడే బట్టలు సర్దేశాడు.

విధిలేక భుక్త బండి కట్టించాడు.

చంద్రశేఖరం, బసవరాజం బండెక్కారు.

బండి నదిలోని ఇసుకనుండి పోతున్నది.

చందూ చూచాడు రాత్రి తాను కూర్చున్నచోటు— ఆ గట్టు — జామిచెట్టు— వాటి చాటున మిలమిలలాడే రెండు జతల లేడికళ్ళు

నదిలో చుక్కల ప్రతిబింబం !!

చంద్రుని ప్రతిబింబం

ముగ్ధ మనోహరంగా చీకటిలో మసక మసకగా వెలిగిన ప్రకృతి.

చంద్రశేఖరం ఒక్కక్షణం వర్తమానాన్ని మళ్ళీ మరచిపోయాడు.

'బాబూ - దిగండి' పాలేరు నివగాం వద్ద బండిని ఆపాడు. బండి అప్పుడే నివగాం వచ్చింది.

సూర్యుడు చురచుర పొడుస్తున్నాడు. కుద్దిగాం కనుచూపు దూరంలో వుంది.

దూరాన బస్సు శబ్దం —

'దేవుడు సృష్టించిన రాజ్యంనుండి మానవుడు నిర్మించిన రాజ్యంలోకి వచ్చాను' మళ్ళీ అనుకున్నాడు చందూ —

'వెళ్ళగానే జాబు రాస్తాము' అన్నాడు బసవరాజం.

'చిత్తం — మీ దయ దాని భాగ్యం' అన్నాడు పాండురంగభుక్త. బస్సెక్కారు ఇద్దరు అతిథులూ.

బస్సు కొత్తూరు పంచాయితీ సమితి వైపుకు దూసుకుపోయింది !!!

బవవరాజం చంద్రశేఖరాన్ని ఒకటి రెండు సార్లు పలకరించడానికి ప్రయత్నించి విఫలుడైనాడు.

చంద్రశేఖరం ఏ యేలోకాలలోనో ఏమి టేమిటో ఆలోచిస్తున్నాడు.

సాయంత్రానికి మళ్ళీ విశాఖపట్నం చేరారిద్దరూ.

చందూ మళ్ళీ డ్యూటీలో చేరాడు.

రెండు రోజుల తర్వాత ఓ సాయంత్రం బసవరాజం చందూను అటు బ్యాంక్‌నుండే ఏకాంతానికి తీసుకుపోయాడు సముద్రం వైపుకు

'మరి వాళ్ళకు జాబు రాయాలి' అన్నాడు బసవరాజం. చందూ కలక్టరేట్‌కు దిగువ బీచ్ ఒడ్డున సముద్రాన్ని చూస్తున్నాడు.

కెరటాలు లెక్కబెడుతున్నాడు.

'అన్నివిధాలా అనుకూలంగా వుంది — నీకూ నచ్చినట్లే వుంది — మరి నీవు ఫార్మల్‌గా ఊఁ — అంటే చాలు...'

'మామయ్యా !' చందూ బసవరాజం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

'ఏమిరా !'

'నాదొక కోరిక మామయ్యా ! నెరవేరుస్తావా !'

'ఏమిటి... ?'

"... ... ... ఏమిలేదు మామయ్యా శశిరేఖను ఎలాగైనా జగన్నాథస్వామికి ఇచ్చి పెళ్ళి జరిగేటట్లు చూడు.'

బసవరాజం నివ్వెరపోయాడు —

అప్పుడు చందూ ఆనాటి సాయంత్రం తాను నదిఒడ్డున కూర్చోవడం, వాళ్ళు రావడం, ఆ విశేషాలు చెప్పాడు.

"అంతే మామయ్యా ! నీకు ఏం కావాలంటే అది ఇస్తాను — ఎంత డబ్బు ఖర్చు అయినాసరే నేను ఇస్తాను — వాళ్ళకు పెళ్ళి జరిగేటట్లు చూడు పాండురంగభుక్తతో చెప్పి—"

కొంచెం ఆగి అన్నాడు బసవరాజం "ఆ పల్లెటూరి పిల్ల నాకు నచ్చలేదని డైరెక్టుగానే చెప్పరాదూ — ఈ డొంక తిరుగుడు దేనికి ఆ పిల్ల జగన్నాథాన్ని ప్రేమించిందని నీ ఉద్దేశమా ?"

బసవరాజం కళ్ళల్లోకి చంద్రశేఖరం విచిత్రంగా చూచి అన్నాడు 'మామయ్యా ! నీవు అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఆలోచించలేవని నాకు తెలుసు. నీవేకాదు ఆఫీసర్ల

అల్పమైనా అధికమే!

మనం సుఖంగా జీవించాలంటే తినడానికి తిండి, కట్టుకొనుటకు వస్త్రాలు, నివసించడానికి ఇల్లు అవసరం. వాటికి ధనం కావాలి.. ఇతరులు సంపాదించి వాటి సౌకర్యాలు కలుగజేస్తే, వారిపై ఆధారపడి కాలం గడపడంకంటె స్వయంగా ధనం సంపాదించి, ఆ సౌకర్యాలు తానే కలిగించుకోవడం ఉత్తమోత్తమం. ఈ విషయాన్ని ఆలోచించే మనవారు ఎన్నడో వివిధములైన వృత్తులను ఏర్పాటు చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యాబోధన మున్నగునవి ఆ వృత్తులు. ఆవృత్తులను చేపట్టినవారు అత్యాశకూ అధికలాభాపేక్షకూ లొంగకుండా న్యాయమైన రీతినే ధనాన్ని సంపాదించవలసి ఉంటుంది. ఈ రీతిని పని చెయ్యడానికి ఆసక్తీ, ఓపికా ఉండాలి. కొందరు సోమరిపోతులు కష్టపడకుండానే ధనాన్నిసంపాదించ దలచి, అందులకై వివిధ మార్గాలను ఆలోచిస్తూ ఉంటారు. వారికి న్యాయాన్యాయాలతో పని లేదు. ఇతరులను మోసగించడంలోనూ దొంగతనంలోనూ నేర్పు చూపి, ధనం సంపాదించి జీవనం గడుపుతారు. అట్టివారు శ్రీమంతులయి తగు మనుష్యులవలె నటిస్తున్నా ఎప్పుడో ఒకప్పుడు తాము చేసిన పనులకు తగిన ప్రతిఫలం పొందకపోరు. అన్యాయార్జితమైన ధనం అధికంగావున్నా, దానికంటె న్యాయమార్గంలో సంపాదించినది స్వల్పమైనా ఎంతో మేలు. ఈ విషయాన్నే క్రింది శ్లోకం వివరిస్తున్నది—

"అకృత్వా పరసంతాపం
అగత్వా ఖల నమ్రతామ్,
అనుత్సృజ్య సతాం వర్త్మ
యత్ స్వల్పమపి తద్బహు."

ఇతరుల వద్ద పనిచేసినా ఆపనికి ప్రతిఫలం గురించి వారితో తగాదా పెట్టుకొని, వారి మనస్సునకు నొప్పి కలిగించ కూడదు. ఎక్కువ డబ్బు యిచ్చినా, దుర్మార్గుల వద్ద పనిచేస్తూ వారిఅడుగులకుమడుగులొత్తుతూ తలవంచి తన హీనతను ప్రకటించకూడదు. ధనాశతో పెద్దలు నడిచే మార్గాన్ని విడిచిపెట్టకూడదు. ఇలా నడుచుకుంటూ సంపాదించిన ధనం స్వల్పమయినా అది అధికమనే అనుకొని సంతృప్తి పొందాలి అని దీని అభిప్రాయం. తాను త్రికరణ శుద్ధిగా ఉత్తముడని పేరు తెచ్చుకోవాలంటే పయి విధంగా నడుచుకోవడం అవసరం.

మోజులోవున్న పాండురంభుక్త కూడా ఆలోచించలేదు. అంతేకాదు నీకు తగిన సమాధానం ఎలా చెప్పాలో నాభావాలు వాక్యాలలో ఎలా చెప్పాలో కూడా నాకు చేతకావడంలేదు మామయ్యా!

మామయ్యా! మొన్న మనం చూచిందొక సుందర స్వప్నం— ఇప్పుడు మనం వున్నదొక పీడకలలో—

మనమీ పీడకలలే కొన్నిదశాబ్దాలుగా అలవాటుపడిపోయాము.

ఈ జీవితాన్నికాదని మనం కుద్దిగాంలో స్థిరపడి పోలేము.'

'ఔనురా! ఆ ప్రకృతి ఆహ్లాదకరంగానే వుంటుంది— కాని అడవిలో కాపురం చేయలేమని నీ భావం— అడవిని ఒక కాన్వాసు మీద చిత్రించి షో రూంలో అలంకరించుకుంటామని మాత్రమే నీవంటావు— అంతేనా ?'

"అంతేకాదు మామయ్యా! అడవిలోని లేడిని నగరంలోని జూలో పెడితే లేడికి కృత్రిమ సౌకర్యాలు లభించవచ్చునేమోగాని అది తన స్వేచ్ఛనూ, సహజత్వాన్నీ సర్వస్వాన్నీ కోల్పోయినట్లే మామయ్యా! ఈ జనసముద్రంలో మునుగుతూ తేలుతూ అందని ముత్యాలకోసం అడుగుకు అట్టడుగుకు ఇంకా ఇంకా కోరికల వలలలో వెళ్ళి వెరుకుతున్న జాలరులం మనం !!!

పూలలో పుప్పొడిలో చెట్లలో చేమలో ప్రకృతిలో వారూ ఒక భాగంగా మారిపోయిన జింక పిల్లలు ఆ జీవులు. శశిరేఖ బస్తీలో వో రిక్షా ఎక్కి సినిమాహాలుముందు క్యూలో టిక్కెట్టుకోసమో రేషను షాపు ముందు కిరసనాయిలుకోసమో నిలబడే దృశ్యం నేను ఊహించలేను— ఆ సౌందర్యానికి ఆ నదీతీరమే చక్కని బ్యాక్‌గ్రౌండ్!! ఆ జామిచెట్టే అందమైన కాన్వాస్— మామయ్యా! నా హృదయం నీకు ఎంతవరకు చెప్పగలిగానో లేదో మరి.. శశిరేఖంటె నేను ఎంత ఇష్టపడ్డానో చెప్పలేను మామయ్యా— అందుకే ఆమె నీ పొగ గొట్టాల జీవితంలోకి లాగి మైలపరచలేను అలాగని నేనా మట్టి గదుల్లోకి వెళ్ళి అక్కడే జీవించనూలేను. ఇది వాస్తవంతో కలిసిన ఆదర్శం తెలిసిందా... ఈ కథాత్మక నిర్ణయాన్ని మీరంతా అభినందించలేక పోవచ్చు అయితే ఇందులో నా త్యాగం కూడా చాలా వుంది" చందూ ఆగాడు— అతని కళ్లు ఎందుకో చెమ్మగిల్లాయి.

జనవరాజం కళ్లు ధగధగ మెరిశాయి—

సముద్రం ఒకటే హోరు పెడుతున్నది !!